AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
21-10-2026 (Wednesday)
MAIN EDITION

ఎంవీఎస్ఆర్ కాలేజీ ఘటనలో ముగ్గురి అరెస్ట్



అక్షరటుడే, హైదరాబాద్ : హైదరాబాద్ నగరంలోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ ఆర్ కాలేజీలో ఇటీవల దాండియా కార్యక్రమం నిర్వహిస్తుండగా ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. లైటింగ్ స్టాండ్ కూలిపోవడంతో ఓ విద్యార్థి చనిపోయింది. ఈ ఘటనలో పోలీసులు ఈవెంట్ మేనేజ్‌మెంట్ కంపెనీకి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. అరెస్టు అయిన వారిలో ఈవెంట్ ఆర్గనైజర్ మల్లేల సాకేత్ (22), పీఎస్‌లైటింగ్స్ అండ్ సౌండ్స్‌కు చెందిన బతుల పునీత్ (21), సాయం నిశాంత్ యాదవ్ (24) ఉన్నారు.

టైగర్ ష్రాఫ్‌పై హత్యాయత్నం.. గన్స్ అందించిన మహిళలు



అక్షరటుడే, మహారాష్ట్ర: బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై హత్యాయత్నం కేసులో కీలక విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసులో ఢిల్లీ పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. వీరు లారెన్స్ బిష్ణోయ్ ముఠాతో సంబంధం ఉన్న వారని తెలిపారు. నిందితులను కునాల్, సుమిత్, రాధ, బబితగా గుర్తించారు. కునాల్ ఆదేశాల మేరకు రాధ, బబిత ఈ దాడికి ఉపయోగించిన ఆయుధాలను ముంబైకి తరలించి, నిందితులకు అందజేశారు.

ఒప్పో నుంచి ప్రీమియం ఫోన్..




అక్షరటుడే, ఫీచర్ డెస్క్: ఒప్పో మరో ప్రీమియం స్మార్ట్‌ఫోన్‌ను భారత్‌లో లాంచ్ చేయడానికి రెడీ అయ్యింది. ఒప్పో ఫైండ్ ఎక్స్ 10 ప్రా పేరుతో తీసుకువస్తున్న ఈ ఫోన్‌ను అక్టోబర్ 22న విడుదల చేయనుంది. భారీ బ్యాటరీ, మీడియాటెక్ డైమెన్సిటీ 9600 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 17 ఆపరేటింగ్ సిస్టంలతో ఈ మోడల్‌ను తీసుకువస్తున్నట్లు తెలుస్తోంది.

జియో ఐపీవో సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్ నుంచి సుమారు రెండు దశాబ్దాల తర్వాత మరో ఐపీవో వచ్చింది. జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ఐపీవో సబ్‌స్క్రిప్షన్ బుధవారం ప్రారంభం అయింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 30,213 కోట్లు సమీకరించాలని కంపెనీ నిర్ణయించింది. కంపెనీ ధరల శ్రేణిని రూ. 1,065 నుంచి రూ.1,119గా నిర్ణయించింది.

లోయలోకి దూసుకెళ్లిన బస్సు.. ఇద్దరు మృతి



అక్షరటుడే, కశ్మీర్ : జమ్మూకశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న ఒక బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో 14 మంది తీవ్రంగా గాయపడ్డారు.

పంజాబ్ సీఎంకు జరిమానా



అక్షరటుడే, న్యూ ఢిల్లీ : పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్‌కు ఢిల్లీ ఎయిర్‌పోర్టు అధికారులు రూ.50 వేల జరిమానా విధించారు. మంగళవారం రాత్రి ఫ్రాన్స్ నుంచి తిరిగి వచ్చిన ఆయన కొన్ని విలాసవంతమైన వస్తువులు తీసుకురాగా.. వాటిపై కస్టమ్ డ్యూటీ వేశారు. ముఖ్యమంత్రి తన సిబ్బందితో కలిసి గ్రీన్ ఛానల్ ద్వారా బయటకు వెళ్తుండగా విమానాశ్రయ అధికారులు తనిఖీ చేశారు. ఆయన కొన్ని విలాసవంతమైన వస్తువులను చెప్పకుండా తీసుకొచ్చినట్లు గుర్తించి ఫైన్ వేశారు. దీనిపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను పంజాబీలకు అవమానంగా అభివర్ణించింది.



విడతలవారిగా నియామకాలు చేపడుతూ పోలీసు శాఖలో అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పోలీసు అమరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణను నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి గోషామహల్ స్టేడియంలో అమరవీరులకు నివాళులర్పించారు.

- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

పోలీస్ శాఖలో పోస్టులు భర్తీ చేస్తాం

- అమరుల కుటుంబాలకు అండగా ప్రభుత్వం
- నేరస్తులపై కఠినంగా ఉండాలి
- సీఎం రేవంత్‌రెడ్డి

సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, ఆహారం కల్తీ వంటి మారుతున్న నేర స్వభావాలు, సవాళ్లను ఎదుర్కోవడంలో పోలీసు శాఖను బలోపేతం చేయడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. పోలీసు అమరుల కుటుంబాలకు తమ ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. పిల్లల చదువు, భద్రత విషయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందన్నారు.

పరిహారం పెంచాం

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుళ్లకు గతంలో రూ. 40 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఉంటే దాన్ని ఏకంగా రూ. కోటికి పెంచామని సీఎం తెలిపారు. హెడ్‌కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు గతంలో రూ.45 లక్షలు ఉండగా రూ.కోటికి, ఎస్సైలు, సీఐలకు రూ.1.25 కోట్లకు పరిహారం పెంచామని తెలిపారు. అమరుల కుటుంబాల్లో అర్హులైన ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించడంతో పాటు, ఇంటి స్థలం ఉచిత విద్య, వైద్య సహాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డుల కుటుంబాలకు రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ పరిహారాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశించారు.

నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలి

రాష్ట్రంలో శాంతిభద్రతలను కాపాడేందుకు నేరస్తులపై కఠినంగా వ్యవహరించాలని సీఎం పోలీసులను ఆదేశించారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే క్రిమినల్స్‌తో సన్నిహితంగా ఉండటం కాదన్నారు. సామాన్య ప్రజలతో బాధ్యతతో మెలగాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల్లో కుటుంబ సభ్యులను చూసుకోవాలని సూచించారు. బాధ్యతతో వ్యవహరించాలన్నారు. మీ క్రమ శిక్షణే మీ బలం.. మీ నిజాయితే ఆత్మ

రేషన్‌కార్డుదారులకు బిగ్ అప్‌డేట్



అక్షరటుడే, హైదరాబాద్: మార్కెట్లో రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలతో సతమతమవుతున్న సామాన్యులకు తెలంగాణ ప్రభుత్వం త్వరలోనే భారీ ఊరటనిచ్చేందుకు సిద్ధమవుతోంది. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా బియ్యంతో పాటు గోధుమ పిండి, కంది పప్పు, పామాయిల్, చక్కెర, చింతపండు, కారం పొడి వంటి 6 రకాల ముఖ్యమైన సరుకులను తక్కువ ధరలకే అందించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారులతో సమీక్ష నిర్వహించారు.

ప్రియుడి కోసం కన్న బిడ్డలనే కడతేర్చిన తల్లి



అక్షరటుడే, రాజస్థాన్: వివాహేతర సంబంధం కోసం కడుపున పుట్టిన బిడ్డలనే కడతేర్చిన అమానుష ఘటన రాజస్థాన్ లోని డిగ్ జిల్లాలో వెలుగు చూసింది. మహిళ మొదటి భర్త కొంతకాలం క్రితం మరణించడంతో, ఆమె తన పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన మరో వ్యక్తితో ఆమెకు పరిచయం ఏర్పడి, అది కాస్తా వివాహేతర సంబంధానికి దారితీసింది. పిల్లలతో వస్తే ఆమెను వివాహం చేసుకోనని తేల్చిచెప్పాడు. పిల్లలు అడ్డుగా ఉండటం వల్లే ప్రియుడు తనను దూరం పెడుతున్నాడని భావించిన ఆ తల్లి.. తన 13 ఏళ్ల కవల కొడుకులను హత్య చేసింది.

ఎస్‌బీఐ ఖాతాదారుల వివరాలు హ్యాక్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఎస్‌బీఐ ఖాతాదారుల వివరాలు హ్యాక్ అయ్యాయి. 3,897 వినియోగదారుల వ్యక్తిగత వివరాలు డార్క్ వెబ్‌లో ప్రత్యక్షం అయ్యాయి. దీనిని బ్యాంక్ సైతం ధ్రువీకరించింది. దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ బ్యాంక్ అయిన ఎస్‌బీఐపై సైబర్ దాడి జరగడం ఆందోళన కలిగిస్తోంది. డార్క్ వెబ్‌లో వినియోగదారుల డేటా బహిర్గతమైనట్లు తమ థ్రెట్ ఇంటెలిజెన్స్ సర్వీస్ ప్రొవైడర్, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ నుంచి అక్టోబర్ 16న హెచ్చరికలు అందినట్లు ఎస్‌బీఐ తెలిపింది. ప్రాథమిక విశ్లేషణలో సుమారు 375,000 రికార్డులను గుర్తించినట్లు బ్యాంక్ తెలిపింది. వీటిలో 3,897 వినియోగదారుల వ్యక్తిగత వివరాలు ఉండటం గమనార్హం.

త్వరలో భారత్–అమెరికా వాణిజ్య ఒప్పందం



అక్షరటుడే, నేషనల్ డెస్క్: భారత్‌అమెరికా వాణిజ్య ఒప్పందంపై కీలక ప్రకటన వెలువడింది. డీల్ ఖరారుకు చాలా దగ్గరగా ఉన్నామని అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో తెలిపారు. కొద్ది వారాల్లో ఒప్పందం ఖరారయ్యే అవకాశం ఉందన్నారు. భారత్, అమెరికా మధ్య సంబంధాలలో ప్రస్తుతం కొంత ఉద్రిక్తత ఉన్నప్పటికీ.. ఇంధన, రక్షణ రంగాలలో సహకారాన్ని విస్తరించే దిశగా అడుగులు పడుతున్నాయి. ఇంధన వాణిజ్యాన్ని పెంచుకోవాలని, అమెరికన్ సాంకేతికతలు, వ్యవస్థల కొనుగోళ్లను అధికం చేయాలని భారత్‌ను రూబియో కోరారు.

దురంధర్ మూవీపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



అక్షరటుడే, ఢిల్లీ : దురంధర్ మూవీపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మూవీ రెండు పార్టులను చూసిన అనంతరం శశిథరూర్ వీడియో ద్వారా తన సమీక్షను పంచుకున్నారు. చిత్రనిర్మాణం, నటన, స్థాయిని ప్రశంసిస్తూనే, దానిలోని గ్రాఫిక్ హింస, రాజకీయ సందేశాన్ని ప్రశ్నించారు. మొదటి భాగం కంటే రెండవ భాగం 'ధురందర్: ది రివెంజ్' తనకు ఎక్కువగా నచ్చిందన్నారు. అయితే అందులోని హింస చాలాసార్లు హద్దులు దాటిందని చెప్పారు. ఇంత హింస, విధ్వంసం, క్రూరత్వం, భారతీయ సినిమా చరిత్రలోనే అత్యంత అసహ్యకరమైన కొన్ని దృశ్యాలను చూపించాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయ పడ్డారు.

బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్‌కు గోల్డ్ స్మగ్లింగ్



అక్షరటుడే, విజయవాడ: బంగ్లాదేశ్ నుంచి హైదరాబాద్ నగరానికి అక్రమంగా తరలిస్తున్న బంగారం, విదేశీ కరెన్సీని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఐదుగురు నిందితులను విజయవాడ సమీపంలో అరెస్ట్ చేశారు. హైదరాబాద్ డీఆర్ఐ అధికారులు విజయవాడ సమీపంలో తనిఖీలు నిర్వహించారు. ఒక కారును ఆపి అందులో సోదాలు చేశారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం మరో బస్సులో తనిఖీలు చేశారు. మొత్తం 3.14 కిలోల బంగారం, 60,000 డాలర్లు, 21,500 యూరోలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ. 5.84 కోట్లు ఉంటుందని తెలిపారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు.

సుప్రీంకోర్టులో వైసీపీకి ఊరట



అక్షరటుడే, ఏపీ : మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సమయంలో హింస, తమ అభ్యర్థులపై దాడిపై వైసీపీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్‌పై బుధవారం ధర్మాసనం విచారణ చేపట్టి, కీలక ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 25 వరకు పోటీచేసే అభ్యర్థుల జాబితా ప్రకటించవద్దని పేర్కొంది. నామినేషన్లు వేయని చోట 48 గంటల సమయం పెంచాలని సూచించింది. హింస, ఆటంకాలపై వచ్చిన ఫిర్యాదులను రేపటిలోగా పరిశీలించాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. నామినేషన్లు దాఖలు చేసి పాల్గొనే హక్కు అనేది స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలలో ఒక అంశం అని స్పష్టం చేసింది. నామినేషన్లు, ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా సాగేలా డీజీపీ చర్యలు చేపట్టాలని సూచించింది.